బలంగా తొందరపెడుతున్నది.

'సరే! ఏదైతే అది అవుతుంది!' అనుకొని.. కళ్లు మూసుకొని, గుండె దడదడ లాడుతుంటే కృష్ణారావు ఫోన్‌నెంబర్ మీద నొక్కాడు. ఫోన్ రింగ్ అవుతున్నది.

శివానందం ఊపిరి బిగబట్టి చూస్తున్నాడు. రెండు సెకండ్లలోనే లిఫ్ట్ చేశాడు కృష్ణారావు.

''నేను సార్! శివానందాన్ని.. నన్ను మన్నించండి సార్!'' అన్నాడు భయం భయంగా.

''సరే! విషయం ఏమిటో చెప్పు?'' మాట కఠినంగా ఉన్నా.. స్వరం మాత్రం మెత్తగా అనిపించింది.

''ఈ టైమ్‌లో ఎవరండీ! అదీ..'' అంటూ పక్కనే కూర్చున్నది కృష్ణారావు భార్య భువన.

''పేరు శివానందం. శ్మశానంలో ఉంటాడు. అతనే ఫోన్ చేశాడు''.

''మీకు వాడు ఫోన్ చేయడం ఏమిటి? వాడి ఫోన్ మీరెందుకు ఎత్తారు?'' అంటూ ఫోన్ లాక్కోబోయింది.

''చేసే వృత్తి ఏదైనా కావచ్చు.. కానీ, వాడు మనిషి భువన! ఏం మాట్లాడతాడో చూద్దాం..'' అంటూ స్పీకర్ ఆన్ చేసి, కొంచెం జరిగి సర్దుకొని కూర్చున్నాడు.

''సార్! అమ్మగారు సీరియస్‌గా ఉన్నారు. నన్ను క్షమించండి. ఇక నేను మీకు ఎప్పుడూ ఫోన్ చేయను. దయచేసి ఫోన్ కట్ చేయకండి!'' అన్నాడు శివానందం.. తడారిపోతున్న గొంతుతో.

''ఫర్వాలేదు శివానందం. ఏం చెప్పాలనుకొంటున్నావో చెప్పు!'' నిదానంగా అన్నాడు కృష్ణారావు..

దేవుడే తన ముందు నిలబడి 'ఏం వరం కావాలో కోరుకో!'' అని అడుగుతున్నట్టుగా అనిపించింది శివానందానికి. కొండంత ధైర్యం వచ్చి.. మాట్లాడటం ప్రారంభించాడు.

''సార్! మీ మూర్తిమత్వాన్ని ఆ రోజు మహాప్రస్థానంలో చూసినప్పటి నుంచీ.. మీరంటే ఎనలేని అభిమానం, గౌరవం ఏర్పడ్డాయి నాకు. అప్పటినుంచి మిమ్మల్ని ఒక గురువుగా భావించుకొంటున్నాను. మీ మాటలు వినాలని.. ఏదైనా విషయం చెబుతున్నపుడు ఆ విషయానికి అనుకూలంగా చేతులు ఊపుతూ, కండ్లు తిప్పుతూ, సన్నగా, తీయని స్వరంతో మాట్లాడే మీ తీరు.. నాకు తీరం వెంబడి నడుస్తున్నపుడు వీస్తున్న చల్లగాలిలా అనిపిస్తుంది. పదేపదే తన్మయత్వంతో వినాలని అనిపిస్తుంటుంది సార్! రోజూ ఒక్కసారైనా మీతో మాట్లాలని నా మనసు ఆరాట పడుతుంది. మీకు ఫోన్ చేస్తుంటే.. ఇప్పుడు అమ్మగారికి కలిగిన అభిప్రాయమే, మీకూ కలగవచ్చని భావించి.. ఎన్నోసార్లు విరమించుకున్నాను సార్! ప్రతిరోజూ మిమ్మల్ని చూడాలనే తపన మాత్రం తగ్గడం లేదు. ఆ ఆరాటంతోనే మీ వర్గీయునితో ఫోన్ చేయించాను. అంతే సార్.. తప్పయితే సారీ!''.. శివానందం మాటలకు చలించిపోయాడు కృష్ణారావు.

''శివానందం! నువ్వు మహాప్రస్థానంలోనే ఉండు. నేను వస్తున్నాను!''.

''సార్!'' నమ్మలేనట్టుగా అన్నాడు శివానందం.

''అవును. ఇప్పుడే వస్తున్నాను!''.

''ఏమండీ! ఇప్పుడు సాయంత్రం ఏడు దాటుతున్నది. ఈ వేళలో శ్మశానంలోకి ఎందుకండీ? అరిష్టం అంటుకుంటుంది'' గద్దింపుగా అన్నది భార్య భువన.

''కాదు! భువనా.. వెళ్లాలి''.

''చెబితే వినరుగా! అయితే నేనూ మీవెంట వస్తాను!''.. విధిలేక అన్నది.

''అభ్యంతరం లేదు. పొద్దున చేసిన పాయసం, పెసర గారెలు బాక్స్‌లో పెట్టుకొని రా!''.

''బాగుంది. అవెందుకు?''.

''తెమ్మన్నానుగా..'' అంటూనే డ్రైవర్‌ను పిలిచాడు.

మరో అరగంట తర్వాత మహాప్రస్థానం గేటు ముందు కారు హారన్ మోగింది. అప్పటికే గేటు ముందు నిలబడి ఎదురుచూస్తున్న శివానందం.. పరుగుపరుగున వచ్చి కారు డోర్ తెరిచాడు. తెల్లటి పైజామా లాల్చీ మీద వాస్‌కోటు వేసుకొని.. హుందాగా, చిరునవ్వుతో కారు దిగుతున్న కృష్ణారావు పాదాలకు తన అరచేతుల్ని పరిచి గౌరవంగా దింపాడు శివానందం.

''బాగున్నావా శివానందం?!'' అంటూ పలకరిస్తున్న సార్‌ను.. కన్నార్పకుండా చూస్తూనే ఉన్నాడు కానీ, గొంతులోంచి మాట రావడం లేదు.

ఎట్టకేలకు బలవంతంగా..

''అమ్మగారిని కూడా తీసుకొచ్చారా సార్! ఈ క్షణాల్ని నా జీవితంలో మరచిపోను సార్! రండి రండి'' అంటూ.. కూర్చోమంటూ కుర్చీలు చూపించాడు.

''ఫర్వాలేదులే!''.. ఇద్దరూ ఒక్కసారే అన్నారు.

''సార్! చనిపోయిన మీ నాన్నగారిని ఇక్కడికి తీసుకొని వచ్చినపుడు మీరు ఒక మాట అన్నారు. తల్లిదండ్రులు మనల్ని కన్నందుకు సంతోషించాలి. రుణపడి ఉండాలి. కానీ, వాళ్లు మనకు ఏదో ఇవ్వలేదని, ఏదో చేయలేదని వాళ్ల మీద ద్వేషం పెంచుకోకూడదని చెప్పారు. మీ మాటలు విన్నాక నాలో ఆందోళన మొదలైంది సార్. మా నాన్నగారు నాకు ఏమీ చేయలేదని, నాకు ఆస్తి ఏమీ మిగల్చలేదని, కనీసం మంచి చదువు కూడా చెప్పించలేదని నిత్యం ఆయన్ను తిట్టుకొనేవాణ్ని సార్! ప్రేమ ఉండాల్సిన స్థానంలో పగ, ద్వేషం వచ్చి చేరాయి. చివరికి ఆయన అంత్యక్రియలు కూడా.. మీరు చేసినంత భక్తి శ్రద్ధలతో మనసు పెట్టి చేయలేదు సార్! అదే నన్ను ఎప్పుడూ వేధిస్తుంటుంది!'' అంటూ మొహాన్ని చేతుల్లో పెట్టుకొని ఏడ్చాడు శివానందం.

''ఊరుకో! పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం మరొకటి లేదు''.. ఓదార్పుగా అన్నాడు కృష్ణారావు.

''ఈ టైంలో మనం ఇక్కడ కలుసుకున్నామంటే.. ఇది కాకతాళీయం కావచ్చు. కానీ, ప్రతి సంఘటన వెనుకా ఏదో ఒక కార్యకారణ సంబంధం వల్లే మనం కలుసుకుంటామన్నది మాత్రం నిజం!''..

కృష్ణారావు మాటలను ఆశ్చర్యంగా వింటూ, ఆయన మొహంలోకే చూస్తున్నాడు శివానందం.

''భువనా! మనం తెచ్చిన బాక్స్ పట్టుకురా!''.. ఆర్డర్‌లా అన్నాడు.

భువన డ్రైవర్‌కు సంజ్ఞ చేసింది. అతను బాక్స్ తెచ్చి ఇచ్చాడు.

''ఇదిగోండి మీ బాక్స్!'' అంటూ అందించింది.

''చూడు శివానందం! ఈ రోజు మా నాన్నగారి మాసికం జరిపాం. ఈ రోజే నువ్వు నాకు ఫోన్ చేశావు. వారి ప్రసాదం నీకు బాకీ ఉన్నట్టు ఉంది. ఇచ్చిపోదామని వచ్చాం. ఇదిగో తీసుకో!'' అంటూ రెండడుగులు ముందుకు వేసి, శివానందానికి ఆ బాక్స్ అందించాడు.

''సార్! ఈ టైమ్‌లో మీ దంపతులు ఇక్కడికి రావడం యాదృచ్ఛికమే కావచ్చు. కానీ, మీలో దాగి ఉన్న మీ వ్యక్తిత్వ వైభవాన్ని చూస్తున్నాను సార్!'' అంటూ బాక్స్ తీసుకొని, కళ్లకు అద్దుకున్నాడు శివానందం.

స్థాణువులా నిలబడిపోయి చూస్తున్న భువనకు కూడా యాదృచ్ఛికాలు ఎలా ఉంటాయో అర్థమైంది. భర్తకు కొంచె దగ్గరగా జరిగి, ఆయన చెవిలో మెల్లిగా..

''ఏమండీ! మీరు కొంచెం ముందుగా అతణ్ని అర్థం చేసుకోవాల్సిందండీ!'' అన్నది.

''ఊ! అవును.. మిస్ అయితే అవలేదు!'' అన్నాడు కృష్ణారావు అంతే మెల్లిగా.

''సరే వస్తాం.. శివానందం!'' అంటూ వెనుదిరగబోతున్న ఆ దంపతుల ఇద్దరి కాళ్లకూ వంగివంగి దండం పెట్టాడు శివానందం. కారులో కూర్చున్న తరువాత..

''చూశావా భువనా! మనకున్న హోదాల పరదాలను క్షణం తొలగించుకొని, తోటి మనుషుల్ని చూసినపుడు.. శ్మశానంలో కూడా మనల్ని ప్రేమించి, అభిమానించి, గౌరవించే వ్యక్తులు ఎందరో ఉంటారు. ఇక్కడ బతుకుతున్నంత మాత్రాన వారందరూ దయ్యాలు కాదు! అనే అంశాన్ని మరిచిపోవద్దు భువనా! భగవంతుని ఉనికిని తెలిపే దేవాలయానికి మనం భక్తి ప్రపత్తులతో ఉదయం – సాయంత్రం అనకుండా ఎలాగైతే వెళ్తుంటామో.. అలాగే ఎంతటివారైనా సరే ఏ సమయంలోనైనా ఈ వల్లకాడు అనే గుడికి రావల్సిందే! అనే జీవిత సత్యాన్ని మర్చిపోతుంటాం. నిజమైన మనిషి అంటే.. నిజాయితీతో విలువలను జీవితాంతం పాటించిన మనిషి బతికి ఉండేది.. మరణించిన తర్వాత ఇక్కడే భువనా!''.. తన తండ్రి జ్ఞాపకాలతో తడిసి ముద్దయిపోతూ.. చెబుతున్నాడు కృష్ణారావు.

''అవునండీ! ఎప్పటికైనా ఎవరైనా ఈ భస్మాలయానికి వచ్చేవాళ్లమే! భయమెందుకు? నిండు ముత్తయిదువులా మీ వెంటవచ్చి, నేనూ ఇక్కడే ఉండిపోవాలని అనిపిస్తుందండీ''.. కళ్లు ఒత్తుకుంటూ అన్నది భువన.

''మనిషి! బతుకు ప్రయాణానికి ఆఖరి గమ్యం ఈ భస్మాలయమే! కాస్త ముందూ – వెనుకా అంతే!''.. తన మునివేళ్లతో భువన పెదవులను సున్నితంగా మూస్తూ అన్నాడు కృష్ణారావు.

శివానందం చెయ్యి ఊపుతూనే ఉన్నాడు.. కారు నెమ్మదిగా మహాప్రస్థానం గేటు దాటింది!■

## రావుల పుల్లాచారి



'నాటకం.. జనజీవన దర్పణం!' అనేది నాటక రచయిత రావుల పుల్లాచారి మాట. వీరి స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్. బీకాం చదివారు. నీటి పారుదలశాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, 2008లో సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందారు. చదువుకునే రోజుల నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. కవితలు, కథలు, నాటక రచనలు మొదలుపెట్టారు. ఇప్పటివరకూ ఇరవై నాటికలతోపాటు ఎన్నో కథలు, లెక్కకు మిక్కిలి కవితలు రాశారు. 'బెత్తెడు జాగ' కథా సంపుటి, 'నాలోకి..' వ్యాస సంపుటి, 'వాళ్లిద్దరు' కవితా సంపుటిని వెలువరించారు. రచ్చబండ, మనసు చెక్కిన శిల్పం, ఆట కథలను నాటికలుగా తీసుకువచ్చారు. వీటిని 'అప్పాజోస్యుల – విష్ణుభొట్ల – కందాళై ఫౌండేషన్' వారు పుస్తకంగా ప్రచురించారు. 20వ నంది నాటకోత్సవాల్లో వీరి 'రచ్చబండ నాటిక'.. నంది అవార్డును గెలుచుకున్నది. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ రచయితగా అవార్డు అందుకున్నారు. తుమ్మల రంగస్థల సాహితీ పురస్కారం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ నుంచి స్ఫూర్తి పురస్కారం దక్కించుకున్నారు. డాక్టర్ పీవీ రమణ రంగస్థల స్మారక పురస్కారం అందుకొన్నారు.